నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, శనివారం 26 అక్టోబర్ 2024 | VIKARABAD


ఫార్మా రైతులను అడ్డుకుంటున్న పోలీసులు


ఆత్మహత్యకు యత్నిస్తున్న స్థానికుడు


రోటిబండ తండావాసుల ఆగ్రహం

సీఎం ఇలాకాలో 'ఫార్మా' రైతుల కన్నెర్ర


రోటిబండ తండాలో కాంగ్రెస్ నాయకుడిని ఉంచిన గదిలోకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న స్థానికులను అడ్డుకుంటున్న పోలీసులు

## కాంగ్రెస్ నాయకుడిని..
# తరిమికొట్టిన ఫార్మా రైతులు

### భూములు ఇవ్వాల్సిందేనంటూ గిరిజనులపై దూషణ .. తిరగబడ్డ అన్నదాతలు


అధికారుల ముందు పరిస్థితిని వివరిస్తున్న ఫార్మా బాధిత రైతు


విద్యుత్తు స్తంభంతో కాంగ్రెస్ నాయకుడిని ఉంచిన గది తలుపులను పగులగొట్టేందుకు యత్నిస్తున్న రైతులు

భూములు కోల్పోవాల్సి వస్తుందేమోనన్న బాధ ఒకవైపు.. ఫార్మా విషం మధ్య బతుకు దుర్భరం అవుతుందన్న భయం మరో వైపు.. వెరసి కొడంగల్ నియోజకవర్గంలోని అనేక గ్రామాల ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం దుద్యాల మండలంలోని లగచర్ల గ్రామంలో ఫార్మా విలేజ్‌పై అభిప్రాయ సేకరణ ఉండగా.. ఆ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వస్తూ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు అగ్గిని రాజేశాయి. ఫార్మా కంపెనీల ఏర్పాటుకు భూములు ఇవ్వాల్సిందేనని, ఇవ్వకపోతే ఊరుకునేది లేదని పేర్కొనడంతో పాటు గిరిజనులకు కులం పేరుతో దూషించడంతో అన్నదాతల ఆగ్రహం కట్టలు తెంచుకొని అతడిపై తిరగబడ్డారు. మా భూములపై మీ పెత్తనం ఏంటని వెంటబడి తరిమారు. పోలీసుల సాయంతో సదరు నేత గ్రామపంచాయతీ కార్యాలయంలో తలదాచుకోగా, ఆ కాంగ్రెస్ నాయకుడ్ని తమకు అప్పగించాల్సిందేనంటూ స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి తరలివచ్చి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఒక దశలో సహనం కోల్పోయిన స్థానికులు హైమాస్ట్ లైట్ల ఏర్పాటు కోసం తీసుకొచ్చిన పెద్ద పైపుతో తలుపులు పగులగొట్టే ప్రయత్నం చేశారు. పోలీసులు లాఠీచార్జ్ చేసి భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆ కాంగ్రెస్ నేతను వేరే చోటుకు తరలించారు. ఇది ప్రారంభమేనని, తమ జోలికి, తమ భూముల జోలికి వస్తే ఊరుకోమని స్థానికులు హెచ్చరించారు. భూములను కాపాడుకునేందుకు ప్రాణ త్యాగం చేస్తానని ఓ యువకుడు పెట్రోల్ ఒంటిపై పోసుకోగా.. గమనించిన స్థానికులు, పోలీసులు అతడి నుంచి ఆ బాటిల్‌ను లాక్కున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఎస్పీ నారాయణరెడ్డి రోటిబండతండాకు చేరుకుని రైతులతో మాట్లాడారు. ఒక్కొక్కరి బాధలను అడిగి తెలుసుకున్నారు. ఫార్మా కంపెనీలకు మా భూములు ఇచ్చేది లేదని అన్నదాతలు ముక్తకంఠంతో తెగేసి చెప్పారు. ప్రభుత్వం పోలీసు బలంతో తమ పోరాటాన్ని అణచాలని చూడడం తగదన్నారు. తమ తాతల కాలం నుంచి ఆ భూములపైనే ఆధారపడి జీవిస్తున్నామని.. ఆ పంట పొలా లు లేకుంటే మా బతుకులు ఆగమై.. వలస వెళ్లాల్సిన దుస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఓటేసి గెలిస్తే ముఖ్యమంత్రి అయిన విషయం మరచి, తమ ప్రాంతంలో నే విషం నింపాలని చూస్తున్న రేవంత్‌రెడ్డి వైఖరిని తీవ్రంగా ఖండించారు. తీరు మార్చుకోకపోతే కాంగ్రెస్ నాయకులను బయట తిరగనివ్వమంటూ రైతులు హెచ్చరించారు. రోటిబండతండాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిస్థితి రణరంగంగా మారింది.

-కొడంగల్/పరిగి, అక్టోబర్ 25

- దుద్యాల మండలంలోని రోటిబండ తండాలో ఉద్రిక్తత
- లగచర్లలో ఫార్మాపై అభిప్రాయ సేకరణకు వస్తున్న దుద్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్‌ను అడ్డుకున్న రైతులు
- ఫార్మాకు కచ్చితంగా భూములు ఇవ్వాల్సిందేనని అన్నదాతలతో వాగ్వాదం
- గిరిజనులను కులం పేరుతో దూషించడంతో ముదిరిన వివాదం
- కాంగ్రెస్ నేతను గ్రామపంచాయతీ గదిలో ఉంచిన పోలీసులు
- ఆ నేతను తమకు అప్పగించాలని గిరిజనుల నిరసన
- పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన స్థానికుడు
- ఘటనా స్థలానికి తరలివచ్చిన వికారాబాద్ ఎస్పీ, అదనపు కలెక్టర్
- హైమాస్ట్ లైటు స్తంభంతో తలుపులు పగులగొట్టేందుకు స్థానికుల యత్నం
- ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో ఉద్రిక్తత
- భారీ సంఖ్యలో పోలీసుల మోహరింపు..
- లాఠీచార్జీకి జంకని గిరిజనులు
- ఫార్మా విలేజ్‌కు భూములివ్వమని, తమ జోలికి వస్తే ఊరుకోమని రైతుల హెచ్చరిక

### రైతు బాధను గుర్తించి.. ఫార్మాను రద్దు చేయాలి..
- పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే



కొడంగల్, అక్టోబర్ 25 : రైతుల బాధను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి.. ఫార్మా కంపెనీల ఏర్పాటు చర్యలను వెంటనే రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం దుద్యాల మండలంలోని లగచర్ల, రోటిబండతండాలో రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితిపై ఆయన స్పందించి మాట్లాడారు. ఫార్మా కంపెనీలు వస్తే ఈ ప్రాంతం కలుషితమవుతుందని, ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలన్నారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ప్రాంతాల్లో ఫార్మా కంపెనీల కోసం గత ప్రభుత్వం పెద్ద మొత్తంలో భూములు సేకరించి సిద్ధంగా ఉంచిందని, ఆ ప్రాంతాల్లో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయకుండా ఇక్కడ ఏర్పాటు చేయాలనుకోవడం విడ్డూరంగా ఉన్నదన్నారు. పచ్చటి పంట పొలాల్లో కాలుష్యాన్ని నింపాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ ఆంతర్యమేమిటో తెలుపాలని ప్రశ్నించారు.

### రద్దయిన రైతుల అభిప్రాయ సేకరణ..

కొడంగల్, అక్టోబర్ 25 : ఫార్మా కంపెనీల ఏర్పాటుకు భూములు ఇవ్వబోమని దుద్యాల మండలంంలోని లగచర్ల గ్రామ రైతులు తెగేసి చెప్పారు. శుక్రవారం ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు అభిప్రాయ సేకరణ కార్యక్రమం రద్దయ్యింది. రోటిబండ తండాకు చెందిన ఫార్మా భూ బాధితులు కాంగ్రెస్ నాయకుడిని అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ఆగ్రహించిన రైతులు టెంట్లను తొలగించడంతో పాటు కుర్చీలను చిందరవందర చేశారు. దీంతో అధికారులు ఎవరూ కార్యక్రమంలో పాల్గొనకపోవడంతో రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం రద్దయ్యింది.


లగచర్ల సమావేశంలో టెంట్లు, కుర్చీలను తొలగించిన రైతులు

# కొనుగోలు కేంద్రాల ఊసేలేదు..

రంగారెడ్డి జిల్లాలో ముమ్మరమైన వరి కోతలు

45 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

- నవంబర్‌లో ఏర్పాటుకు అధికారుల చర్యలు..!
- అవస్థలు పడుతున్న అన్నదాతలు
- తక్కువ ధరకు దళారులకు పంట విక్రయం



*రంగారెడ్డి జిల్లాలో వానకాల వరి కోతలు ముమ్మరమయ్యాయి. వడ్లు ఇండ్లకు చేరుతున్నాయి. అయినా కొనుగోలు కేంద్రాల ఊసేలేదు. ధాన్యాన్ని ఎక్కడ విక్రయించాలో తెలియక అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. జిల్లాలో 45 కేంద్రాల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. వాటిని ఇంకెప్పుడు ఏర్పాటు చేస్తారని రైతులు మండిపడుతున్నారు. జిల్లాలోని మంచాల, యాచారం, మాడ్గుల, తలకొండపల్లి, కందుకూరు, షాద్‌నగర్, కడ్తాల్, షాబాద్, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, నందిగామ, శంకర్‌పల్లి తదితర మండలాల్లో ఈ ఏడాది వరిపంటను అధికంగా సాగుచేశారు.*

*-ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 25*

### జిల్లాలో 1.38 లక్షల ఎకరాల్లో వరి సాగు..

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 1.38 లక్షల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేయ గా.. 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి వస్తుందని అధికారులు అంచనా వేశారు. వర్షాలు ముందుగానే కురియడంతో అన్నదాతలు వరి పంటను సాగు చేశారు. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరం కాగా ఆయా మండలాల్లో 25 నుంచి 30 శాతం పంటను రైతులు కోసి కల్లాల్లో నిల్వ చేశారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడమే తరువాయి ధాన్యాన్ని కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ, కొనుగోలు కేంద్రాలు ఇప్పట్లో తెరుచుకునే అవకాశాల్లేవని తెలుస్తు న్నది. సన్నరకం పంటకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని ప్ర భుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈ పంటను రైతులు అత్యధికంగా సాగుచేశారు. కాగా పంట చేతికందే సమయంలోనే కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రాక పోవడంపై అన్నదాతలు మండిపడుతున్నారు. వచ్చే నెలలో కొనుగోలు కేం ద్రా లను ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది.

### 45 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు..

వానకాలంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనేందుకు రంగారెడ్డి జిల్లాలో 45 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఐకేపీ, డీసీఎంఎస్, సహకార సంఘాల ద్వారా వరి పంటను కొనాలని నిర్ణయించారు. మంచాల, ఇబ్రహీంపట్నం, యాచారం, కందుకూరు, మాడ్గుల, తలకొండపల్లి, ఆమనగల్లు, షాద్ నగర్ తదితర మండలాల్లో అధికంగా ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం వడ్లకు క్వింటాల్‌కు రూ.2320తో పాటు అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్‌గా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే సన్నరకం, దొడ్డురకం ధాన్యాన్ని కొనేందుకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది.

### రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



కేసీఆర్ హయాంలో అక్టోబర్ నెలలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధా న్యాన్ని కొనేది. కానీ, రేవంత్ సర్కారు ఇంకా జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్కువ ధరకు దళారులకు తమ పంటను అమ్ముకుంటున్నారు. సకాలంలో కొనుగోలు కేంద్రాలనుఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి.

-అచ్చన శ్రీశైలం

### మరో పదిహేను రోజులు..

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు మరో పదిహేను రోజు ల సమయం పట్టే అవకాశమున్నట్లు అధికారులు చెబుతున్నారు. నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మంత్రుల చేతుల మీదుగా వాటిని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో పదిహేను రోజులంటే.. అప్పట్లోగా జిల్లాలో వరి కోతలు పూర్తయ్యే అవకాశం ఉందని అన్నదాతలు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి త్వరగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే మద్దతు ధర వస్తుందని, లేకుంటే దళారులకు విక్రయించాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంలో ప్రభుత్వం విఫలం



కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం విఫలమైంది. జిల్లాలో ఇప్పటికే వరి కోతలు ముమ్మరమయ్యాయి. మరో పదిహేను రోజుల తర్వాత కొనుగోలు కేంద్రా లను ప్రారంభిస్తే అన్నదాతలకు ఎలాంటి లాభం ఉండదు. అప్పటి వరకు జిల్లాలో కోతలు పూర్తవుతాయి. ఇండ్లలో నిల్వ చేసుకునే అవకాశం లేని వారు దళారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు. ప్రభుత్వం స్పందించి త్వరగా కేంద్రా లను ఏర్పాటు చేస్తే అన్నదాతలకు మద్దతు ధర లభిస్తుంది.

-బూడిద నర్సింహారెడ్డి, రైతు

